

# పక్కవీధి జన్మంత దూరం

తింటున్న అన్నం ఆపేసి పెళ్ళాం మీద చర్రున లేచాడు దేవుడు "పచ్చడింత చప్పగా వుంటే ఈ అన్నం తింటానికా పారబొయ్యటానికా?"

రంగమ్మ మాట్లాడలేదు.

మళ్ళీ ముద్ద నోట్లో పెట్టుకుంటే చెప్పలేని అరుచిగా వుంది దేవుడికి.

"ఆరేళ్ళనుంచి కాపురం చేస్తున్నావు నాకేం గావాలో నీకు తెలియదు. నిన్న పంచెకి నీలిరంగు ఎక్కువ పెట్టావు. మంచి నీళ్ళ కుండమీద మూతపెట్టవు. చారులో బెల్లం వద్దంటే వినవు. నీకు మొగుడక్కర్లేదే! వాణ్ణి ఏడిపించటమే కావాలి!"

రంగమ్మకి రోషమొచ్చి "కావాల్సింది చేసి పెట్టటం లేదా? అడిగి చేయించుకోరాదా?" అంది.

దేవుడు అగ్గైపోయాడు. "అడిగి చేయించుకోనా. నువ్వేమైనా ఇవ్వాళే అడివిలోంచి వచ్చావే? .... అన్నీ తెలిసి చేస్తున్నావు. నిన్ను కట్టుకోటం నా బుద్ధి తక్కువ ...."

రంగమ్మ ఉడికిపోయింది. "ఆ సంగతి ఇప్పుడు తెలిసిందా." అని ఎదురొచ్చింది.

దేవుడు ఆ కోపంలో ఏం చేసేవాడో తెలియదు. "ఇప్పుడే తెలిసిందే .... ఇప్పుడేనే" అంటూ పళ్ళు కొరుకుతూ తినే కంచంలో చెయ్యి కడుక్కుని లేచిపోయాడు.

" ఏం మనిషి." అని లోపల విసుక్కుంది రంగమ్మ.

వెళ్ళి చాపమీద పడుకుంటే దిండు కింద ఎత్తుకి ఇటుకరాయి లేదు. అన్నం

అవగానే అలవాటుగా నమలటానికి రంగమ్మ శనగబద్దలు పెట్టలేదు. దేవుడు కుత కుత ఉడికిపోతూ ఊగిపోతున్నాడు. ఇదేం పెళ్ళాం. ఛీ! ఇవి చిన్న చిన్న విషయాలే కావచ్చు. ఇదంటే తన కసహ్యం! కంపరం! ఇవే కావాలని ఎందుకు చేస్తుంది. అందరి పెళ్ళాలూ మొగుడికేం కావాలో తెలుసుకుని మసులుకుంటుంటే తనకి పడని పనులన్నీ చేసి ఎందుకు పిచ్చెక్కిస్తుంది? తన కిష్టమైన బంతిపూలెట్టుకోదు. కొప్పు ముడుచుకోమంటే బారు జడ వేస్తుంది? ఇలా తిండిలేక మాడి చస్తుంటే ఏమీ కానట్టు పట్టించుకోదు ....తప్పయి పోయిందని చెప్పొచ్చుగా .... చెప్పదు .... రాక్షసి.,.... దెయ్యం ... పిశాచి ..... దీంతో కాపురం కుదర్దు ... చెంగున లేచి ఉత్తరీయం బుజాన వేసుకొని పక్కవీధిలో వాళ్ళ బాబాయి యింటికి వెళ్ళిపోయాడు దేవుడు.

రాత్రికి రాలేదు. రంగమ్మ కంటిమీద కునుకులేదు. మర్నాడు పంచెలు, ములుగర్ర తెప్పిస్తూ ఇంటికి బియ్యం, పప్పు పంపించాడు. రంగమ్మ వండలేదు. రోజూ బియ్యం పప్పు వస్తున్నాయి. దేవుడు తిరిగి రాలేదు. మూడు రోజులు పస్తుండి నాలుగో రోజు గంజి కాచుకు తాగింది. ఐదోరోజు బియ్యం, పప్పూ వస్తే తిప్పి పంపేసి, తనే పొలంలో కూలికి వెళ్ళింది. అంతే! ఆనాటి నుంచి పక్కవీధిలో వున్న దేవుడికి, ఇవతల వీధిలో వున్న రంగమ్మకి అనంతాకాశమంత అడ్డుగోడ.

సంవత్సరం గడిచింది. ఒకరి వూసు ఒకరికి లేదు. ఓ రోజున పక్క వీధిలో సన్నాయి రండోళ్ళు మోగాయి. దేవుడు మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడు. రంగమ్మ వల వల ఏడవ లేదు. తలుపు మూసుకు లోపల కూర్చుంది? "అప్పుడెప్పుడో పెళ్ళి పీటలమీద చూశాను దేవుణ్ని! మళ్ళీ పెళ్ళి చూసొస్తేనో" అనుకుంది. కాని పీటల మీద చెల్లమ్మ పెళ్ళికూతురుగా కూర్చుందన్న తలంపు రాగానే గుండె చెరువయింది. కళ్ళు గట్టిగా మూసుకుని సన్నాయి మోత విన్పించకుండా చెవుల్లో దూది పెట్టుకుంది.

చెల్లమ్మ గడుసుది. దేవుణ్ణి పక్కవీధి వైపు చూడనివ్వలేదు సరిగదా ఆ గాలి కూడా సోకనివ్వలేదు. మూడేళ్ళలో వరసగా ముగ్గురు పిల్లల్ని కని మరింతగా ముడి బిగించింది. దేవుడుకూడా వెనక్కితిరిగి చూడలేదు.

ఓ పండుగరోజు మాత్రం తీపి తింటూ "పాపం! అదేం చేసుకుందో"

అనుకున్నాడు పైకి ఆ మాటలు విన్న చెల్లమ్మ "ఒంటిదిగదా! బాగానే చేసుకునుంటుంది. ఇదిగో! చంటోడు అయ్యో అయ్యో! అని ఒకటే ఏడుపు" అంటూ దేవుడి ఒళ్ళో పిల్లాడ్ని వొదిలేసి వెళ్ళిపోయింది.

పదేళ్ళు గడిచాయి. రంగమ్మకి లేని వయసు పైబడ్డట్టు నడుం వంగిపోయింది. ముక్కోటికి గుడికి వచ్చింది. పడుతూ లేస్తూ మెట్లన్నీ ఎక్కి దేవుడి దగ్గరకొచ్చి పూజారి చేతిలో కొబ్బరికాయ, కర్పూరం పెట్టి "పూజ చేయించడయ్యా" అంది.

"ఎవరి పేరున చేయించను!" అన్నాడు పూజారి.

"దేవుడిపేర చేయించడయ్యా" అంది రంగమ్మ.

"ఏ దేవుడి పేర? నీ దేవుడిపేరా ? ఈశ్వరుడి పేరా?"

"ఇద్దరూ ఒకటే! కానివ్వండయ్యా" అంది రంగమ్మ.

అప్పుడే చెల్లమ్మతో గుళ్ళోకొచ్చిన దేవుడు ఈ మాటలు విని చలించిపోయాడు. హారతి అద్దుకుంటున్న రంగమ్మతో ఏదో అనబోయాడు. కాని ఆమె ఆ అవకాశం ఇవ్వకుండా అమ్మవారి గుళ్ళో కెళ్ళిపోయింది. రంగమ్మకి తెచ్చిన హారతి తనూ కళ్ళకద్దుకోవటమే మిగిలింది దేవుడికి. కాలం గడుస్తోందేకాని, పక్కపక్క వీధులు పరలోకాల్లా వున్నాయి.

ఓ రోజు చింతలరేవులో రంగమ్మ స్నానం చేసి నీళ్ళు ముంచుకుంటోంది. చెల్లమ్మ బట్టలుతుక్కుని తడి బట్టలు బుజాన వేసుకుంది. మగ అండ వున్న మనిషి కాబట్టి దేవుడు కావిడేసుకుని నీళ్ళెప్పుడో మోసేశాడు.

బిందె ఎత్తుకుని ముందునడుస్తోంది రంగమ్మ వాడి వత్తయిన రంగమ్మ ముఖం చూస్తే చెల్లమ్మకి ఉన్నట్టుండి జాలేసింది. ఇంతలో రంగమ్మ తూలి పడబోతే చెల్లమ్మ చెంగున ముందుకు దూకి పట్టుకుని "అప్పా ఎంత బరువో" అంటూ బుజం మీద బిందె లాక్కుని తన బుజం మీది కెత్తుకుంది.

ఇద్దరూ నడుస్తున్నారు.

చెల్లమ్మ అంది "అప్పా! ఒక్కదానివే వుంటావు. నా ఇంటికి రాకూడదా?" నడుస్తున్న రంగమ్మ ఆగిపోయి చెల్లమ్మని ఎగాదిగా చూసింది. నా భాగ్యం దోచుకున్నదానా? నాకు గంజినీళ్ళు ధర్మం చేస్తానంటున్నావా అనుకుందో ఏమో తెలియదు -- కన్నీళ్ళు పొంగగా అంది. "వస్తానమ్మా! మళ్ళీ జన్మలో నీ కడుపున పుట్టి నీ ఇంటికొస్తా .... *